రహదారులకు మహర్దశ



- ప్రతిష్ఠాత్మక రీజనల్ రింగ్‌రోడ్డుకు తొలగిన అడ్డంకులు
- నల్లగొండ నుంచి కర్నూల్‌కు అనుసంధానమయ్యే మరో జాతీయరహదారి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కీలక రహదారులకు వరుస శంకుస్థాపనలు
- రూ.700కోట్లతో నల్లగొండబైపాస్‌రోడ్డుకు ప్రతిపాదనలు

నల్లగొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లా రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఓ వైపు రాజధానికి అనుసంధానించే రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త కార్యాచరణచేపట్టగా, మరోవైపు ఉమ్మడిజిల్లాలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తూ జాతీయ రహదారుల నిర్మాణానికి భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఉమ్మడి జిల్లాలో రోడ్లు, విస్తరణ, కొత్త లేన్ల నిర్మాణాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా పనులకు వరుసగా శంకుస్థాపనలు చేస్తుండటంతో రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రోడ్ల అనుసంధానం మెరుగుకానుంది. కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల సమావేశమై జిల్లాలో ప్రాధాన్యమున్న రహదారులను ప్రతిపాదించారు.ఈ నెల రోజుల్లో కీలక రోడ్ల ప్రాజెక్టులకు మంత్రి శంకుస్థాపనలు చేయగా,మరికొన్ని కీలక ప్రాజెక్టులకు కేంద్రానికి నివేదించారు. ఇంకోవైపు జిల్లాలో అంతర్గత రోడ్ల మరమ్మతులు, కొత్త బీటీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి త్వరలో పూర్తిస్థాయిలో అన్నిపనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సహా పలు కీలక ప్రాజెక్టులకు వినతి

ఇటీవల కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశమైన సమయంలో కీలకమైన రీజనల్ రింగురోడ్డు చేపట్టేందుకు ఆటంకాలను తొలగించే అంశంపై చర్చించారు. ఉత్తర, దక్షిణ ప్రాజెక్టులను వీలైనంత వేగంగా చేపట్టేందుకు కావాల్సిన అనుమతులను కేంద్రం మంజూరుచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సదుపాయాల కల్పనకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం పేర్కొనడంతో ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టయింది. కీలకమైన ఈ ఆర్‌ఆర్‌ఆర్ పూర్తయితే యాదాద్రి భువనగిరి జిల్లాకు రాజధానికి అనుసంధానం పెరగడంతో పాటు ఈ ప్రాంతం పారిశ్రామికంగా, సేవారంగాలపరంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. దీంతో పాటు ఏపీ నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లా మీదుగా నల్లగొండకు అనుసంధానమయ్యేలా ఒక జాతీయ రహదారిని చేపట్టాలని కేంద్రమంత్రికి ప్రతిపాదనలు సమర్పించారు. ఏపీ రాష్ట్రం కర్నూల్ శివారులోని జోగులాంబ గద్వాల జిల్లా పుల్లూరు నుంచి (44వ నెంబర్ జాతీయరహదారి) అలంపూర్- జటప్రోల్- పెంట్లవెల్లి- కొల్లాపూర్- లింగాల- అచ్చంపేట- డిండి- దేవరకొండ- మల్లేపల్లి- నల్లగొండ వరకు 225 కిలోమీటర్ల నూతన జాతీయరహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. వీటితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న నల్లగొండ బైపాస్ రోడ్డుకు రూ.700కోట్ల నిధులతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ పనులన్నింటికీ వచ్చే నెలలో టెండర్లు ఆహ్వానించాలని భావిస్తున్నారు.

పలు రహదారులకు శంకుస్థాపనలు

ఉమ్మడి జిల్లాలోని పలు కీలక రహదారుల విస్తరణ, బీటీ నిర్మాణాలకు ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. నకిరేకల్-వాడపల్లి, పానగల్-నకిరేకల్, నల్లగొండ-దేవరకొండ రోడ్లను నాలుగు లేన్లుగా మార్చేందుకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా నల్లగొండ-ముశంపల్లి రహదారిని డబుల్‌లైన్‌గా విస్తరించనున్నారు. నల్లగొండ-నర్సింగ్‌భట్ల-కురంపల్లి రోడ్డు, మామిడాల-చిరుమర్తి-మాడుగులపల్లి రోడ్లను డబుల్ రోడ్డుగా, ఇండ్లూరు-చందనంపల్లి రోడ్డుకు, లచ్చుగూడెం-పాల్వాయి రోడ్లకు ఇటీవల మంత్రి శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, బీటీ రెన్యువల్స్ కోసం, డబుల్ రోడ్ల నిర్మాణాల కోసం ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తుండడంతో ఈ పనులన్నీ పూర్తయితే ఉమ్మడి జిల్లాలో రహదారుల పరిస్థితి మెరుగుకానుంది.

నా మనసంతా నల్లగొండ చుట్టూనే



నేనెక్కడున్నా నా మనసంతా నల్లగొండ చుట్టూనే ఉంటుంది. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జిల్లా అన్ని రంగాల్లో వెనకబడింది. మా హయాంలో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకుతీసుకెళ్లే పనులు చేపడుతున్నాం. రోడ్ల విషయంలో గత ప్రభుత్వం జిల్లాపై వివక్ష చూపింది. దాన్ని సరిచేసేలా అన్నిప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు,విస్తరణ చేపడుతున్నాం.నల్లగొండ బైపాస్‌రోడ్డుకు రూ.700కోట్లతో త్వరలో శంకుస్థాపన చేస్తాం. ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన రోడ్ నెట్‌వర్క్ ఉండేలా కృషిచేస్తున్నాం.

\- కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి

నేడు దేవరకొండ నియోజకవర్గంలో రోడ్లకు శంకుస్థాపన

దేవరకొండ, మార్చి 9: దేవరకొండ నియోజకవర్గంలో ఈనెల 10న పలు రోడ్లకు రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో ఉదయం 10.30గంటలకు రూ.4కోట్లతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన, 11.30 గంటలకు సాయిబాబా దేవాలయంలో పూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు రూ.14కోట్లతో చేపట్టనున్న దేవరకొండ పట్టణంలోని డిండి ఎక్స్‌రోడ్డు-మైనంపల్లి బిడ్జివరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఛాయా సోమేశ్వరుడికి రథోత్సవం



శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఛాయాసోమేశ్వరాలయం వద్ద శనివారం రాత్రి స్వామివారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, నిర్వాహకులు

•7లో..

ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం పీఆర్సీ

రీజియన్‌లో 2,479మందికి లబ్ధి



నల్లగొండ, మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. పీఆర్సీతో కూడిన వేతనాలు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి.ఆర్టీసీ సిబ్బంది సంక్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రీజియన్ పరిధిలో మొత్తం 2,479మంది ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి దీంతో లబ్ధి చేకూరనుంది. ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, అధికారులు, ఏఈలు, అసిస్టెంట్ మేనేజర్లు, డిపో మేనేజర్లు, క్లర్క్‌లు, పెయింటర్లు, ఆర్టీసీ కానిస్టేబుళ్లు, ఎలక్ట్రీషియన్లు వీరందరికీ ప్రయోజనం చేకూరనుంది. నల్లగొండ రీజియన్ పరిధిలో మొత్తం ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. నల్లగొండ డిపో పరిధిలో 497మంది ఉద్యోగులు, దేవరకొండ డిపో పరిధిలో 428మంది, కోదాడ డిపో పరిధిలో 276మంది, యాదగిరిగుట్ట పరిధిలో 429మంది ఉద్యోగులు ఉన్నారు. అదేవిధంగా సూర్యాపేట డిపో పరిధిలో 398మంది, మిర్యాలగూడ డిపో పరిధిలో 379మంది, నార్కట్‌పల్లి డిపో పరిధిలో 72మంది ఉద్యోగులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. టీఎస్ ఆర్టీసీలో పేస్కేల్ ప్రతీ నాలుగేళ్లకోసారి సవరిస్తారు. ప్రస్తుతం 2017పేస్కేల్‌తో పాటు 2021 పేస్కేల్ సవరించాల్సి ఉంది. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2017 పేస్కేల్‌ను సవరించి 21శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేసేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉద్యోగులతో పాటు 2017 ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు కూడా ఈ ఆర్థిక ప్రయోజనం పొందనున్నారు.

పట్టణంలో ఆగనున్న వందేభారత్ రైలు

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రైల్వే శాఖ
- ట్విట్టర్‌లో పేర్కొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మిర్యాలగూడ టౌన్, మార్చి 9: సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ రైలు ఇకపై పట్టణంలో ఆగనుంది. కేంద్ర పర్యాటక శాఖమంత్రి కిషన్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్(సికింద్రాబాద్), గుంటూరు రైల్వే డివిజన్ల పరిధిలో నడి చే పలు రైళ్లకు రాష్ట్రంలోని 14 స్టేషన్లలో రైల్వేశాఖ స్టాపులు ఇచ్చినట్లు ట్వీట్ చేశారు. ఆ యారైళ్లలో వందేభారత్ (ట్రైన్ నెం. 20701/20702) రైలుకు మిర్యాలగూడ స్టేషన్‌లో స్టాప్‌ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగారేపల్లే- సికిందాబ్రాద్ ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నెం.1764 6)రైలుకు రామన్నపేటలో స్టాప్ ఇచ్చినట్లు ట్విట్టర్ వేదికగా కేంద్రమంత్రి వెల్లడించడంతో రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లను ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిన రైల్వేశాఖ ట్రైన్ టికెట్ల ధరలు తగ్గించడంతోపాటు పలు స్టేషన్లలో అదనంగా స్టాపులు ఇవ్వడంపై నెటిజన్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు.అయితే ఈ విషయమై అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు.

వరికి ఎకరాకు రూ.20వేల పరిహారం ఇవ్వాలి

సీపీఎం నేత పాలడుగు ప్రభావతి



ఎండిన వరి పైరును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కనగల్, మార్చి 9: కరువు కోరల్లో చిక్కి సాగునీరందక ఎండిన వరి పంటకు పరిహారం అందించి అన్నదాతలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించి ఎండిన వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నెల రోజుల క్రితం ఎస్‌ఎల్‌బీసీ కాల్వ నీటితో చెరువులను, కుంటలను నింపి ఉంటే పంటలు ఎండిపోయేవి కాదన్నారు. రైతులు కరువు కోరల్లో చిక్కుకోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో సర్వే చేపట్టి ఎండిన వరికి ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. పాలకులకు ఎన్నికలు, ఓట్లు, పదవులపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. కార్యక్రమంలో కానుగు లింగస్వామి, ఎండి అక్రమ్, సైదులు, సుల్తానా, అంజి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి అభినందనీయం

జాజుల శ్రీనివాస్‌గౌడ్



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు రూరల్, మార్చి 9: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని పాటుపడడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కోతులారం గ్రామానికి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ రూ.10లక్షలు, రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు రూ.10లక్షలు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రూ.10లక్షలు కేటాయించగా, రూ.30లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టి పెరిగిన గ్రామాల రుణం తీర్చుకోవడానికి గ్రామం నుంచి ఎదిగిన ధనవంతులు, కార్పొరేట్ సంస్థల అధిపతులు, ఐటీ పారిశ్రామికవేత్తలు స్వచ్ఛందంగా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జాజుల పారిజాత, సత్యనారాయణగౌడ్, నరసింహగౌడ్, జక్కలి లోకేష్, శేఖర్, నాగిరెడ్డి, జలంధర్, తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో నీటికి అల్లాడుతున్న వన్యప్రాణులు



నీటి తొట్ల వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన అటవీ జంతువులు

చందంపేట మండలం నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు, జంతువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. దీంతో తాగునీరు అందించేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

\- దేవరకొండ

బోర్లు వేసి దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్న అటవీశాఖ



వేసవి కావడం, ఈ ఏడాది వానాకాలంలో సరైన వర్షాలు లేకపోవడంతో నల్లమలలోని వన్యప్రాణులు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే అటవీశాఖ నల్లమల కంభాలపల్లి రేంజ్ పరిధిలో 60కిపైగా నీటితొట్లను గతంలో ఏర్పాటు చేసింది. ఆ తొట్లను అధికారులు నీటితో నింపుతుండటంతో వీటి వద్ద వన్యప్రాణులు దాహార్తి తీర్చుకొని సేదతీరుతున్నాయి. ఈ దృశ్యాలు అటవీశాఖ సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. చందంపేట మండలం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో 26,796 హెక్టార్లలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. అటవీ జంతువుల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం రూ.4.50కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టింది. ఆ నిధులతో అధికారులు అడవి అభివృద్ధి, నర్సరీలు, రోడ్లు, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేశారు. 50కిపైగా సీసీకెమెరాలతో నిఘా, వాచ్‌టవర్‌లు, బేస్‌క్యాంపులు నిర్మించారు. అటవీ ప్రాంతం చుట్టూ ఇనుప గేట్లు, కంచె ఏర్పాటు చేశారు. 60కిపైగా నీటితొట్లు, 6 చెక్‌డ్యాంలు, 15 ఊట కుంటలు ఏర్పాటు చేసి బోర్లు వేసి నీరు అందించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో 50కిపైగా చిరుత పులులు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు రేస్‌కుక్కలు, ఎలుగుబంట్లు, మనుబోతులు, దుప్పులు, కొండంగులు, జింకలు, నెమళ్లు, అడవి పందులు, కుందేళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

బోర్లు వేసి తాగునీరు అందిస్తున్నాం



నల్లమల్ల, కంభాలపల్లి రేంజ్ పరిధిలో వన్యప్రాణులు, అటవీ జంతువుల సంరక్షణకు ఇటీవల రెండు బోర్లు వేసి నీటి తొట్లను నింపుతున్నాం. వన్యప్రాణులు, జంతువులకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి కావడంతో దాహార్తి తీర్చుకునేందుకు వన్యప్రాణులు, అటవీ జంతువులు నీటి తొట్ల వద్దకు వచ్చి సేద తీరుతున్నాయి.

\- భాస్కర్, కంభాలపల్లి రేంజ్ అటవీశాఖ అధికారి



ముగిసిన సాగర్ మాత మహోత్సవాలు

దివ్యబలి పూజలో పాల్గొన్న పీఠాధిపతులు



సందేశాన్ని అందిస్తున్న గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య

నాగార్జునసాగర్, మార్చి 9: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కుడివైపున ఉన్న మాచర్ల మండలం విజయపురి సౌత్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగర్ మాత మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమష్టి దివ్యబలి పూజా కార్యక్రమానికి గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరయ్యారు. విజయపురి సౌత్‌కు చేరుకున్న పీఠాధిపతులకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి బాణాసంచా, డప్పు చప్పుళ్ల నడుమ సాగర్ మాత చర్చికి తీసుకువచ్చారు. అనంతరం పీఠాధిపతి చిన్నాబత్తుల భాగ్యయ్య మాట్లాడుతూ, మేరీమాత అనుగ్రహం ఎల్లవేలలా ఉంటుందన్నారు. సమష్టిపూజా బలిలో పాల్గొన్న క్రైస్తవ భక్తులంతా సోదర ప్రేమతో మెలగాలని ఆకాంక్షించారు. కష్టాల నుంచి తప్పించుకోకుండా, కష్టాలను అనుభవిస్తేనే మోక్షం లభిస్తుందని పేర్కొన్నారు. శత్రువును సైతం ప్రేమించాలని, తద్వారా మోక్షమార్గం లభిస్తుందన్నారు. ఈ వేడుకల్లో వివిధ జిల్లాల క్రైస్తవ గురువులు, కన్యాస్త్రీలు, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఎడమకాల్వకు నీటి విడుదల వాయిదా

నాగార్జునసాగర్, మార్చి 9: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాల్వకు శనివారం నీటి విడుదల చేయాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సోమవారం తర్వాత నీటి విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం కుడికాల్వకు నీటి విడుదల నిలిపివేసిన తర్వాత ఎడమకాల్వకు నీటి విడుదల చేయాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) అధికారులు సూచించినట్టు సాగర్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

బుద్ధవనాన్ని సందర్శించిన శ్రీలంక పోలీసుల బృందం



బుద్ధవనంలో శ్రీలంక పోలీసుల బృందం

నాగార్జునసాగర్, మార్చి 9: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నిర్మితమైన బుద్ధవనాన్ని శ్రీలంక దేశానికి చెందిన సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం సందర్శించారు. సైబర్‌క్రైమ్‌ను అరికట్టడంలో శిక్షణలో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన వారు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుద్ధవనాన్ని సందర్శించారు. వారి వెంట సీఐ బీసన్న, ఎస్‌ఐలు ఉన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి

పరారీలో నిందితుడు ● సూర్యాపేట జిల్లాలో ఘటన

నేరేడుచర్ల, మార్చి 9: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో ఓ మైనర్‌పై లైంగికదాడి జరిగింది. ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌ శనివారం తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల మండలానికి చెందిన 14ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన షేక్‌ సుభాని(45) అనే వ్యక్తి లైంగిక దాడి చేసి పరారయ్యాడు. బాధితురాలి తల్లి వరంగల్‌ జిల్లా చెందిన ఓ వ్యక్తితో 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకుంది. రెండేళ్లకి కుమార్తె పుట్టింది. ఆ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకుంది. తర్వాత కుమార్తెను తీసుకొని బతుకుదెరువు కోసం కోదాడకు వచ్చింది. కోదాడలో నివాసముంటున్న ఆమెకు నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ లారీడ్రైవర్‌ పరిచయమయ్యాడు. అతడిని వివాహం చేసుకుంది. ఏడాదిగా అద్దె ఇంట్లో కుమార్తె, భర్తతో కలిసి ఉంటోంది. వీరు ఉండే పక్క ఇంట్లోనే పెయింటింగ్‌ పని చేసే షేక్‌ సుభాని నివాసముంటున్నాడు. సుభాని కొంతకాలంగా భార్యతో విభేదించి దూరంగా ఉంటున్నాడు. నేరేడుచర్లలో మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. బాధితురాలు, షేక్‌ సుభాని ఇరువురు కుటుంబాలు ఒకే ఇంట్లో పక్కపక్క గదుల్లో అద్దెకు ఉంటున్నారు. షేక్‌ సుభానితో సహజీవనం చేస్తున్న మహిళతో శుక్రవారం రాత్రి ఘర్షణ జరగడంతో ఆమె శుక్రవారం రాత్రి సదరు బాలిక ఇంట్లో పడుకుంది. సుభాని మాత్రం అద్దె ఇంట్లోనే ఉన్నాడు. సుభానితో సహజీవనం చేస్తున్న మహిళకు ఇదే వీధిలో సొంత ఇల్లు ఉంది. ఉదయం బాలిక, తన తల్లితో కలిసి సుభాని సహజీవనం చేస్తున్న మహిళ ఇంటికి శనివారం ఉదయం వెళ్లారు. ఇంటికి వెళ్లి అన్నం పెట్టుకు రమ్మని తల్లి చెప్పడంతో బాలిక ఒంటరిగా వారు ఉంటున్న అద్దె ఇంటికి వచ్చింది. అది గమనించిన సుభాని ఆమె ఇంట్లోకి వెళ్లి బాలికపై బలవంతంగా లైంగిక దాడి చేసి గోడదూకి పారిపోయాడు. బాలిక ఈ విషయాన్ని తల్లికి చెప్పడంతో వారు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని హుజూర్‌నగర్‌ సీఐ చలమంద రాజు పరిశీలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



భువనగిరిలో బాలుడిని తల్లి ఆసియాబేగానికి అప్పగిస్తున్న అధికారులు

భువనగిరి టౌన్‌ / భువనగిరి అర్బన్‌, మార్చి 9: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడు ఎట్టకేలకు శనివారం అమ్మ చెంతకు చేరాడు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్‌ మండలం పడమటి సోమారం జాతరలో పోలీసులకు దొరికిన 11 ఏళ్ల మానసిక దివ్యాంగుడైన అబూబాకర్‌ను శనివారం అధికారులు తల్లికి అప్పగించడంలో కథ సుఖాంతమైంది. అధికారులు పేర్కొన్న వివరాల ప్రకారం.. హైదరాబాద్‌ బండ్లగూడలో నివాసం ఉంటున్న ఆసియాబేగం భర్తతో విడాకులు తీసుకుంది. ఆమె కుమారుడు అబూబాకర్‌ మానసిక దివ్యాంగుడు. అయితే ఈ నెల 5వ తేదీన అతడు ఇంటి నుంచి తప్పి పోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించపోకపోవడంతో అదే రోజు బండ్లగూడ పోలీస్‌సేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు మిస్సింగ్‌ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఇంటి నుంచి తప్పిపోయిన బాకర్‌ బీబీనగర్‌ మండలం పడమటి సోమవారం జాతరలో ఒంటరిగా సంచరించడాన్ని గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకొని జిల్లా బాలల పరిరక్షణ సమితికి అప్పగించారు. అయితే బాలుడి వివరాలు చైల్డ్‌హెల్ప్‌లైన్‌, సోషల్‌ మీడియాలో వెల్లడించడంతో మిస్సింగ్‌ కేసుగా దర్యాప్తు చేస్తున్న బండ్లగూడ పోలీసులు గమనించి ఆరా తీయడంతో అబూబాకర్‌గా నిర్ధారణ అయింది. ఈ మేరకు జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్‌ బండారు జయశ్రీ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.సైదులు, చైల్డ్‌ హెల్ప్‌లైన్‌-1098 కోఆర్డినేటర్‌ దశరథ పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వ హించారు. లింగోద్భవ వేళ స్వామి, అమ్మ వార్ల మహిమలను వివరిస్తూ అర్చకులు కల్యాణ తంతును జరి పించారు. ఉపవాసంతో పాటు జాగరణ చేసిన భక్తులు కల్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించారు. ఉమ్మడి జిల్లాలో పెద్దజాతరల్లో ఒకటైన మేళ్ల చెర్వులో ప్రభల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అదేవిధంగా ఎద్దుల పందేలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. సూర్యాపేట పరిధిలోని పిల్లలమర్రి దేవాలయంలో, నేరేడుచర్లలోని సోమప్ప ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు.

● భక్తుల జాగరణతో ఆలయాలు కిటకిట ● మేళ్లచెర్వులో ఆకట్టుకున్న కల్యాణోత్సవం, ప్రభల ప్రదర్శన ● కొనసాగుతున్న ఎద్దుల పందేలు




మేళ్లచెర్వు జాతర సందర్భంగా ప్రభలను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హాజరైన భక్తులు, విద్యుద్దీపాల ప్రభలు

మేళ్లచెర్వు, మార్చి 9 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో మహాశివరాత్రి జాతర సందర్భంగా మండలకేంద్రం జనసంద్రమైంది. శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం, ఆలయ ప్రాంగ ణంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలను తిలకించడా నికి, తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామం, ఆలయ ప్రాంగణం మొత్తం జనసంద్రంగా మారింది.

కన్నులపండుగా కల్యాణం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వయంభూ శంభులింగేశ్వరస్వామి వారికి, ఇష్టకామేశ్వరి అమ్మవా రికి అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, రాధా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కన్నులపండువగా కల్యాణ తంతు నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను రాత్రి 2 గంటలకు స్వామి వారిని నంది వాహనంపై, అమ్మవారిని పల్లకిలో ఊరేగింపు తీసుకెళ్లారు. మొదటగా ఎదుర్కోళ్ల మహోత్సవం జరి గింది. అనంతరం కల్యాణ మండపానికి తీసుకెళ్లి, అశేష భక్త జనసమక్షంలో ముత్యాల తలంబ్రాలతో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నంది వాహనంపై స్వామి, అమ్మ వార్లను ఉదయం నాలుగ గంటలకు ప్రధాన ఆలయా నికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ మహేంద్రకుమార్, ఈవో నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజ్యసభ సభ్యులు వద్ది రాజు రవిచంద్ర కుటుంబ సభ్యులు శనివారం స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

జాతరకు పెద్దసంఖ్యలో భారీగా తరలిరావడంతో శుక్రవారం అర్ధరాత్రి ఆలయ ప్రాంగణంతో పాటు మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు గుడికి, గ్రామానికి మధ్యలోని ఎస్ఎస్సీ కాల్వల బ్రిడ్జిలపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. పోలీసుల అప్రమ తతో ట్రాఫిక్‌ను నియంత్రించారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు ప్రారంభం

జాతర సందర్భంగా అట్టహాసంగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను సీఐ రజితారెడ్డితో కలిసి పోశం నర్సిరెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. మొదటి రోజు ఎనిమిది మంది మహిళ, పురుషుల జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. మొదటగా సూర్యాపేట, రంగారెడ్డి మహిళా జట్లు తలబడ్డాయి. కార్య క్రమంలో ఎంపీపీ పద్మ, తహసీల్దార్ జ్యోతి, ఆలయ చైర్మన్ శంభిరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన ఎద్దుల పందేలు రెండోరోజు శనివారం ఉదయం నుంచే కొనసాగుతున్నాయి.



కబడ్డీ పోటీల సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ రజితారెడ్డి

పరమశివుడి ఆశీస్సులుండాలి: మంత్రి

ప్రతీ ఒక్కరికి పరమశివుడి ఆశీస్సులుండా లని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతర సందర్భంగా రూ.15 లక్షల వరకు వెచ్చించి వివిధ వర్గాల వారు విద్యుద్దీపాల ప్రభలను ఏర్పాటు చేశారు. ఏడు ప్రభ లను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాత్రి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1994 నుంచి జాతరకు క్రమంతప్పకుండా హాజరవుతున్నానని, ఆల యంలో మౌలిక సదుపాయల కల్పన కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయించానన్నారు. ఇదిలా ఉం డగా 100, 110అడుగుల ఎత్తు వరకు ఏర్పా టుచేసిన ప్రభలు ప్రజలను ఆకట్టు కున్నాయి.

ఛాయాసోమేశ్వరాలయంలో

నల్లగొండ కల్చరల్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో శివపార్వతుల కల్యాణవేడుకలను వైభవంగా నిర్వహించారు. పానగ ల్లులోని శైవక్షేత్రాలైన ఛాయా, పచ్చల సోమేశ్వరాల యాలు, నల్లగొండలోని వీటీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం, షేర్‌బంగ్లా సంతోషీమాత ఆలయం, బీట్ మార్కెట్ శ్రీరామకోటిస్థూప దేవాలయంలో కన్నుల పండువగా కల్యాణాన్ని నిర్వహించారు. ఛాయా సోమేశ్వరాలయంలో శనివారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లను అగ్నిగుండాల్లో ఊరేగించారు. అనంతరం అభిషేకాలు నిర్వహించారు. హైదరాబా ద్‌కు చెందిన వింజమూరి లక్ష్మి బృంద శాస్త్రీయ సంగీ తాలాపన కార్యక్రమం జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంలో ఆశీనులను చేసి కోనేరులో తెప్పోత్సవం, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, బండారు ప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, డీఎస్పీ శివరాంరెడ్డి, కౌన్సిలర్లు వేణుగో పాల్‌రెడ్డి, పర్వతరెడ్డి, అలుగుబెల్లి తిరుమల్‌రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఛాయాసోమేశ్వరాలయంలో అగ్నిగుండాల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

మట్టపల్లి క్షేత్రంలో

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండ లంలోని లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంక ర్యాలు జరిగాయి. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ మూర్తులకు పురవీధుల్లో గరుడవాహన సేవ నిర్వ హించారు. అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మట్టపల్లి పురవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు

వేణుగోపాలస్వామి ఆలయంలో

నార్కట్‌పల్లి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి అభిషేకాలు, శివపా ర్వతుల కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. నార్కట్‌పల్లి, గోపలాయపల్లి, ఏపీలింగోటం, అక్కెన పల్లి, అమ్మనబోలు గ్రామాల్లో కల్యాణోత్సవాలు నిర్వ హించారు. నార్కట్‌పల్లిలోని బస్టాండ్ వెనుక ఉన్న పార్వతీ రామలింగేశ్వరస్వామి, మాండ్ర రహదారిలోని పురాతన సిద్ధ రామలింగేశ్వరాలయం, అక్కెనపల్లిలోని పురాతన బ్రహ్మసూత్రం గల శివాలయం, ఏపీలిం గోటం, హరిహర క్షేత్రం గోపలాయపల్లిలలో శివపార్వ తుల కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా నార్కట్‌పల్లిలోని రామలింగేశ్వరాలయంలో ఎదుర్కోలు రథోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ పూజారులు నిడిగొండ భగవాన్ శర్మ, పుట్ట పాక మురళీధర్‌రావులచే పూజాదికాలు జరుపబ డ్డాయి. ఈ ఉత్సవాల్లో ఆలయ చైర్మన్‌లు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి, పుల్లెంల శ్రీనివాస్ మంగమ్మ దంపతులు భక్తులు పాల్గొన్నారు.



దివ్యాలంకార శోభితుడు రామలింగేశ్వరుడిని సేవలో రథం వద్దకు తీసుకువస్తున్న అర్చకులు

వైభవంగా దివ్యవిమాన రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి9: యాదగిరికొండపై అనుబంధ ఆలయం పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరుడు కొలువుదీరిన శివాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం లక్షబిల్వార్చనలు, రాత్రి వేళ దివ్యవిమాన రథోత్సవ ఘట్టాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. శివాలయంలో కొలువుదీరిన రామ లింగేశ్వరుడిని ఆరాధించిన అర్చకులు నిత్యహవనం, శివపంచాక్షరీ, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు, వేద ఇతిహాస పారాయణ పఠనం చేశారు. అనంతరం ప్రధానాలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరస్వామిని కొలుస్తూ శివపార్వతుల సహస్రనామ పఠనాలతో గంట పాటు లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం నిత్య పూజాకైంకర్యాలు, వేద పారాయణ పఠనం, యాగశాలలో నిత్య లఘు పూర్ణాహుతి పర్వాలను నిర్వహించారు.

యాత్రాజనుల పూజల సందడి

యాదగిరీశుడి సన్నిధిలో శని వారం యాత్రాజనుల పూజల సందడి నెలకొంది. మహాశివరాత్రి పర్వదినం కావడంతో యాత్రాజ నులు పెద్దసంఖ్యలో క్షేత్ర సందర్శ నకు తరలివచ్చారు. యాత్రాజనుల సంచారంతో కొండకింద కల్యాణ కట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్టాండ్లు, కొండపైన ఆలయ తిరువీధులు, ఉభయ దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల ప్రాంతాలు సందడిగా కనిపించాయి. స్వామివారి ధర్మదర్శనాలకు రెండు గంటలు, ప్రత్యేక దర్శనాలకు అర గంట సమయం పట్టినట్టు, సుమారు 20వేల మందికి పైగా యాత్రికులు ఇష్టదైవాలను దర్శించుకున్నట్టు, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,00,487 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్యపూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలను నిర్వహించారు.



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కన్నుల పండువగా రథోత్సవం

యాదగిరికొండపైన శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రామ లింగేశ్వరస్వామి దివ్య విమానరథంపై భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశాడు. ఆలయ బాహ్యప్రాకారంలో స్వామివారి దివ్యవిమానరథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో పర్వవ ర్థినీ అమ్మవారిని, రామలింగేశ్వరుడిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక సేవలో తీర్చిదిద్దారు. ప్రధానాలయంలో ఊరేగించి బాహ్యప్రాకారంలోని దివ్యవి మాన రథం వద్ద ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దిన పురోహితులు, అర్చకబృందం రథాం గబలి, దిష్టికుంభ పూజలను నిర్వహించారు. అనంతరం దివ్యవిమాన రథంపై కల్యాణమూర్తులను అధిష్ఠింపజేశారు. అనంతరం దివ్యవిమాన రథాన్ని శివా లయ ప్రాకార మండపంలో భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఊరేగింపు వేడుకలు నేత్రపర్వంగా కొనసాగాయి. ఈ విశేష పర్వాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహోత్సవాల్లో రథోత్సవ విశిష్టత

నూతన కల్యాణపరులైన శివపార్వతులను శివరాత్రి మహోత్సవాల్లో దివ్యవి మాన రథంలో అధిష్ఠింపజేసి ఊరేగింపు నిర్వహించడం సంప్రదాయం. అర్ధనారీ శ్వర రూపంలో పార్వతీ, పరమేశ్వరులను ఏకరూపంలో దర్శనం కలిగించే ఈ రథోత్సవ ఘట్టం శివరాత్రి మహోత్సవాల్లో మహోత్తరమైందని, అద్వైత జ్ఞానప్రకా శమని శివ పురాణం దేవస్థాన ప్రధాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణ శర్మ వివరించారు. రథమనే దేహ భ్రాంతిని విడనాడి జ్ఞాన స్వరూపుడైన శివుడిని ఆశ్రయిస్తే కైవల్యం ప్రాప్తిస్తుందని వేదాలు తెలుపుతున్నాయని ఆయన అన్నారు.

పిల్లలమర్రి ఆలయంలో

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట జిల్లాకేంద్ర పరి ధిలోని పురాతన శైవాలయం పిల్లలమర్రి ఎర్రకేశ్వరా లయం ఎదుట శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిం చారు. శనివారం తెల్లవారుజామున నామేశ్వర స్వామి దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహలను మంగళవాయి ద్యాల నడుమ, మహిళల కోలాటాల మధ్య కల్యాణమం డపానికి ఉత్సవవిగ్రహలను ఊరేగింపుతో తీసుకువచ్చారు. ఎదుర్కోళ్ల కార్యక్రమం అనంతరం శాస్త్రోక్తంగా కళ్యా ణాన్ని అర్చకులు హరిప్రసాద్‌శర్మ, మనగలేటి సంతోష్ శర్మ ఘనంగా నిర్వహించారు. జాగరణ కోసం పెద్దసం ఖ్యలో తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. అదేవిధంగా ఎండ్లపల్లి గ్రామంలో స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో లింగాయత్ లింగ బలిజ పూజారుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో పిల్ల లమర్రి దేవాలయ కమిటీ చైర్మన్ కోట్ల సైదులుగౌడ్, డైరెక్టర్లు, యండ్లపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.



పిల్లలమర్రిలో కల్యాణోత్సవ ఘట్టం

నేరేడుచర్ల సోమప్ప ఆలయంలో

నేరేడుచర్ల: మహాశివరాత్రి సందర్భంగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని సోమప్ప దేవాలయం, నేరేడుచర్ల, దిర్శించర్ల శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రాచీన సోమప్ప దేవాలయంలో పూజారి శ్రీనివాసశాస్త్రి, వేద పండితులు సాగి నర్సింహమూర్తి, దుర్గాప్రసాద్ శర్మ, ఇరువంటి శ్రీపాదశర్మ ఆధ్వర్యంలో రంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మూడు రోజులు సెలవు దినాలు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శుక్రవారం రాత్రి వినోద కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ దగ్గరుండి పర్యవేక్షించారు. నేరేడుచర్ల శివాలయంలో కల్యాణానికి భారీగా తరలివచ్చారు. ఆలయ పూజారి ఉగ్రదండి శివప్రసాదశర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. రాచకొండ కోటేశ్వరావు, కొణతం సీతారాంరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్ర మాలు నిర్వహించారు. పలువురు దాతలు, వ్యాపార వేత్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.




సోమప్ప ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు, హాజరైన భక్తులు

నవవధువును బలిగొన్న కులాంతర వివాహం

భువనగిరి రూరల్, మార్చి 9: ప్రేమించి కులాంతర వివాహం చేసు కున్న 19 రోజులకే అత్తగారి వేధింపులు తాళలేక నవవధువు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి చికిత్సపొందుతూ శనివారం మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చీమలకొం డూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ వీ.సంతోష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... చీమలకొండూరు గ్రామానికి చెందిన బీట్కూరి మనోహర్, అదే గ్రామానికి చెందిన పల్లెర్ల భూమిక(19) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వేర్వేరు కులాలు కావ డంతో మనోహర్ కుటుంబసభ్యులు వీరి వివాహానికి అంగీకరిం చలేదు. అయితే ఫిబ్రవరి 17న యాదగిరిగుట్టలో మనోహర్, భూమిక కులాంతర వివాహం చేసుకున్నారు. కాగా, వివాహం అనంతరం వారిద్దరూ చీమలకొండూరులోని మనోహర్ ఇంటికి వచ్చారు. కులం తక్కువదానివి అంటూ అత్త స్వరూప సూటిపోటి మాటలతో వేధిస్తుండటంతో విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు పంచాయితీ పెట్టి ఇరు కుటుంబాలను సముదాయించారు. అయితే అత్తతో పాటు భర్త కూడా వేధిస్తున్నాడని భూమిక మనోవేదనకు గురైంది. ఈ నెల 2వ తేదీన అదే గ్రామంలో ఉంటున్న తల్లిగారింటికి వెళ్లింది. అత్తింటి వ్యవహారశైలిపై తీవ్ర మనస్తాపంతో ఉన్న భూమిక ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. బంగ్లాపై దుస్తులు ఆర వేస్తున్న తల్లి రేణుక అనుమానంతో కిందికి వచ్చి కిటికీలోంచి గదిలో చూడగా భూమిక తాడుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే చుట్టుప క్కల వారిని కేకలు వేస్తూ పిలిచి తలుపులను పగులగొట్టి లోపలికి వెళ్లే లోగా భూమిక అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను హుటాహుటిన భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మేడ్చల్ జిల్లా ఘట్‌కే సర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులు అక్కడ చికిత్స పొందుతూ భూమిక శనివారం మృతి చెందింది.



భూమిక(ఫైల్‌ఫొటో)



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న భూమిక బంధువులు

భూమిక మృతదేహంతో ఆందోళన

అత్తింటి వేధింపులతోనే భూమిక ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొ ంటూ ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆమె మృతదేహంతో మనో హర్ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు.ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న రాచకొండ కమిషనరేట్ భువనగిరి జోన్ ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్ బందోబస్తుతో గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భూమిక కుటుంబసభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరికి తరలించారు. రెండు గంటల పాటు ఆందోళన జరిగింది. భూమిక తల్లి రేణుక ఫిర్యాదు మేరకు ఆమె భర్త మనోహర్, అత్త స్వరూపపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

మఠంపల్లిలో మెడికల్ దుకాణ లైసెన్స్ రద్దు

మఠంపల్లి, మార్చి 9 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో మత్తు మందులు విక్రయించిన దుర్గాభవానీ మెడికల్ షాప్ లైసెన్స్ రద్దు చేస్తూ యజమాని రమావత్ రవీందర్ నాయక్‌కు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు. శనివారం తహ సీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ వెంకటరావు, ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా దాడులు, తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దాడుల్లో దుర్గాభవానీ మెడికల్ యాజమాని పట్టుబడ్డాడని, కోదాడ, హుజూర్‌నగర్, మఠంపల్లి ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు మత్తు మందుల వ్యాపారం కోసం ఓ ముఠాగా పనిచేస్తు న్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ముఠా వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ చేస్తున్నామని, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు ఉన్నా వదిలేది లేదన్నారు. వారం రోజుల్లో మరెన్నీ దాడులు, విచారణ కొనసాగించి అందరి వివరాలు వెల్లడిస్తామన్నారు.

తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన గమనించాలి

మత్తుమందుకు బానిసలై యువకులు, విద్యార్థులు తమ భవిష్యత్‌ను కోల్పోతున్నారని, తల్లి దండ్రులు ప్రతి రోజూ పిల్లల ప్రవర్తనను గమనించాలని తహసీల్దార్ మంగా రాథోడ్, కోదాడ ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్‌లు సూచించారు. మత్తు మందులకు అలవాటు పడితే విద్యార్థులు సైకోలా మారుతారని తెలిపారు. అంతదూరం రాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల్లో మార్పులు కనబడితే కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్తే ఆ తర్వాత కారణా లను తెలుసుకొని వారి భవిష్యత్‌ను కాపాడే వీలుంటుందని సూచించారు.

వీఆర్ఏ ఆత్మహత్య

డిండి, మార్చి 9 : నల్లగొండ జిల్లా డిండి మండలంలో వీఆర్ఏ ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన రాగడపల్లి కృష్ణయ్య(70) గ్రామంలో వీఆర్ఏగా పనిచేస్తున్నాడు. కృష్ణయ్య ఉద్యోగం చేస్తున్నందున తమకు రూ.12లక్షలు ఇవ్వాలని పాలివారు డిమాండ్ చేశారు. రూ.12లక్షలు తెచ్చి ఇవ్వలేని కృష్ణయ్య మనస్థాపంతో ఈనెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివే సుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. కృష్ణయ్య మృతికి కారణమైన రాగడపల్లి విజయ్, రాగడపల్లి ధనంజయతోపాటు మరో ఎనిమిది మంది పైనా కృష్ణయ్య కుమారుడు పెద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు. కృష్ణయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా వారికి వివా హాలు అయ్యాయి.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



వేణుగోపాలస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మార్చి 9: దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. నేరేడుగొమ్ము మండలం చిన్నమునిగల్ వేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని, దీంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వేణుగోపాలస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, నాయకులు కొండ శ్రీశైలం యాదవ్, లోకసాని కృష్ణ, బిక్కునాయక్, యుగేందర్‌రెడ్డి, పాపనాయక్, రాంసింగ్, హరికృష్ణ, రూప్లనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలి



మహిళా ఉద్యోగులకు సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

నల్లగొండ కల్చరల్, మార్చి 9: పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్‌రెడ్డి, నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం జరిగిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ డీఏను ప్రకటించిందని, దానిని కలుపుకొని నాలుగు డీఏలు రావాల్సి ఉందని వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగులను, ఈ నెలలో జన్మించిన 30మంది పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రంగయ్య, ఆంజనేయులు, కృష్ణయ్య, శ్రీశైలం, కేశవాచారి, టి.రమేష్, గోపాల్‌రెడ్డి, అలీ, చక్రపాణి, హుస్సేన్, నీరజ, విజయలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



టీఎన్జీవోస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, మార్చి 9: ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడమే కాకుండా ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెం కట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో తన క్యాంపు కార్యాలయంలో టీఎన్జీవోస్ జిల్లా యూనిట్ 2024 డైరీ, క్యాలెండర్‌ను శనివారం మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యోగులు తమ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకరావాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రతీ పేదవాడికి చేరే విధంగా కృషి చేయాలన్నారు. టీఎన్జీవోస్ అధ్యక్షుడు నాగిళ్ల మురళి మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో ఏ ఒక్క నెలలో కూడా ఒకటో తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పడిన దాఖలాలు లేవన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన 90 రోజులు కాకముందే మార్చి నెలలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, టీఎన్జీవోస్ మాజీ అధ్యక్షుడు ఎడుదొడ్ల వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి జేజాల శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ ఫోరంల అధ్యక్ష, కార్యదర్శులు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం బాధ్యులు, ఆశా కార్యకర్తల యూనియన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రూ.2లక్షల రుణమాఫీని అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కందాల ప్రమీల

శాలిగౌరారం, మార్చి 9: రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం తక్షణమే రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. సీపీఎం మాజీ మండల కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యుడు మారోజు చంద్రమౌళి వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చంద్రమౌళి ఆశయ సాధన కోసం నేటి యువత, సీపీఎం కార్యకర్తలు ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడారని కొనియాడారు. నేటి ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాలని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీని తక్షణమే అమలుచేయాలని ఆమె డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు తేలుకంటి జగన్, మక్కబుచ్చి రాములు, కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, బట్ట అవనిజ, రామచంద్రు, గట్టయ్య, అంజి, సోమేశ్వర్, శ్రీను పాల్గొన్నారు.

జిల్లాలో ఆధ్యాత్మిక శోభ

● వైభవంగా స్వామివారి కల్యాణాలు

● కిటకిటలాడిన ఆలయాలు

జిల్లాలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. జిల్లాలోని పలు ఆలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా శనివారం అర్చకులు శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని చిరుమర్తి గ్రామంలో గల వరాల సోమేశ్వర్‌రావు ఆలయంలో శనివారం మహా శివరాత్రి సందర్భంగా అర్చకులు శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. కల్యాణోత్సవంలో సినీ డైరెక్టర్ ఎస్.శంకర్‌మాధవి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గజ్జి మధుసూదన్, అమృతవల్లి, గంటెపంగ యాదయ్యకలమ్మ, ముదిరెడ్డి దేవేందర్‌రెడ్డిసరిత, వెంకటాచారి, భక్తులు పాల్గొన్నారు.

ముప్పారంలో వైభవంగా శివపార్వతుల కల్యాణం

నిడమనూరు: మండల పరిధిలోని ముప్పారం గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని శనివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సుంకి మల్లప్ప, అర్చకులు గుదె అనంతరామశర్మ, ప్రసాదశర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ముప్పారం బస్సు పునరుద్ధరణ, శివాలయం నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే జైవీర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవో సిరికొండ నవీన్, జడ్పీటీసీ నందికొండ రామేశ్వరిమట్టారెడ్డి, అంకతి వెంకటరమణ, అంకతి సత్యం, మార్వాక మేరెడ్డి వెంకట్‌రెడ్డి, బొల్లం శ్రీనివాస్, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, శివ, ఎంపీటీసీ నాగేంద్రనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో జరుగుతున్న పార్వతీ శంభులింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం తెల్లవారుజామున దేవతామూర్తులను గ్రామ పురవీధుల్లో పల్లకిలో ఊరేగించారు. గ్రామస్థులు దేవతామూర్తులకు పూజలు చేసి నివాళులర్పించారు. శివ మాలధారులు భజనలు చేశారు. శాలిగౌరారం, భైరవునిబండ, చిత్తలూరులోని శివాలయాల్లో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది.

కొనసాగుతున్న రాజరాజేశ్వరస్వామి బ్రహోత్సవాలు

చింతపల్లి: చింతపల్లి మండలకేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం శివునికి త్రికాల పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి భక్తుల సమక్షంలో శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. కల్యాణానికి సుమారు వెయ్యి మంది భక్తులు హాజరయ్యారు. శనివారం భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి చైర్మన్ కొమిరిశెట్టి వెంకటయ్య, ఉత్సవకమిటీ సభ్యులు ఎల్లంకి రవి, తెరటిపల్లి రాములు, బొలసాని సత్యనారాయణ, గోవిందు రవి, గోవిందు ప్రసాద్, బొడ్డు మహేష్‌గౌడ్, ఉప్పల యాదయ్య, శ్రీనివాస్, వెంకటేష్, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి: రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

మలప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్): మండలంలోని రంగుండ్ల గ్రామంలో కొలువైన అతి ప్రాచీనమైన మల్లప్ప స్వామివారిని శనివారం ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని వీక్షించారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డిని దేవాలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కల్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లిపెద్దిరాజుయాదవ్, దేవాలయ కమిటీ చైర్మన్ బీవీ.రమణరాజు, కొత్తపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ దేశబాలునాయక్, మాజీ సర్పంచులు భిక్షానాయక్, రంగసాయినాయక్, మాజీ ఉప సర్పంచ్ కిశోర్‌నాయక్, నాయకులు పుల్లం రాజు, రవీంద్రచారి, నాగార్జున, శ్రీనివాస్‌యాదవ్, మహేష్, లింగాల శంకర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం: వల్లాలలో దేవతామూర్తులను ఊరేగిస్తున్న భక్తులు



నిడమనూరు: ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు



తిరుమలగిరి(సాగర్): మల్లప్పస్వామిని దర్శించుకొని మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

రామలింగేశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

మర్రిగూడ, మార్చి 9: మహాశివరాత్రి సందర్భంగా శనివారం తెల్లవారుజామున శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా మండలంలోని రాజుపేటతండా గ్రామనివాసి చేనేత కార్మికులైన శేరిపల్లి శివశంకర్, శేరిపల్లి ఈశ్వర్ ఆధ్వర్యంలో అమ్మవారికి, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మర్రిగూడ మండలకేంద్రంలో భవానీ రామలింగేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా ఇరువురు కలిసి ట్రాక్టర్ మీద పట్టువస్త్రాలను దేవాలయం వరకు నేస్తూ కల్యాణం సందర్భంగా దేవాలయంలో అందజేశారు. అంతకుముందు పూజారి ఎల్‌వీ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా ఆ దేవాలయం ఆవరణలో 22 మంది దంపతులు కలిసి హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం చెరుకు శ్రీరాములుగౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌లో అమ్మవారికి చేనేత పట్టువస్త్రాలు నేస్తున్న శివశంకర్

రఘువీర్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంపై హర్షం

వేములపల్లి, మార్చి 9: సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి కుమారుడు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డిని నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడంపై మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రావు ఎల్లారెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు తంగెళ్ల సత్తిరెడ్డి, నాయకులు హాజీ, బొంగర్ల వినోద్, పాదూరి కిరణ్‌రెడ్డి, పుట్టల గురవయ్య, పాల్వాయి నగేష్, నగేష్, నాగయ్య, రాములు, సునీల్, జాని, సుందర్, రాము, వెంకట్, రమణ, అశోక్, ఇస్రం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లిలో బాణసంచా కాల్చుస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేంకటేశ్వరస్వామికి 101 కొబ్బరి కాయలు

త్రిపురారం: నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా కుందూరు రఘువీర్‌రెడ్డి ప్రకటించడంపై మండల ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని బొర్రాయిపాలెం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, జడ్పీటీసీ ధనావత్ భారతి శనివారం 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి, నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించినప్పుడే సమాజం పురోభివృద్ధి



మహిళలను సన్మానిస్తున్న డాక్టర్ సింధూజ

నల్లగొండ, మార్చి 9: మహిళలను గౌరవించినప్పుడే సమాజం పురోభివృద్ధి చెందుతుందని డాక్టర్ సింధూజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీపీయూఎస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తపస్ కార్యాలయంలో జరిగిన వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ ధర్మాలు మహిళలను గొప్పగా కీర్తించాయన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవని, స్త్రీలకు సముచిత స్థానం ఉందని గుర్తుచేశారు. స్త్రీలు ఎక్కడ పూజించబడతారో ఆ ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ మహిళ కన్వీనర్ లలితకుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.జ్యోతి, జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరాం, సంఘం నాయకురాలు సరిత, తులసీ, మమత, నీరజ, సువర్ణ, రేణుక, వెంకట్‌రెడ్డి, డాక్టర్ పద్మ పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం

మునుగోడు రూరల్, మార్చి 9: మండలంలోని కోరటికల్ గ్రామంలో శ్రీలక్ష్మీ నారాయణ సహిత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున వేద పండితులు శ్రీనివాస్‌శర్మ, బొల్ల వెంకటేశం ఆధ్వర్యంలో స్వామివారి అగ్నిగుండాలు, రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి రథాన్ని ఊరేగింపుగా లాగారు.

12 నుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

డిండి, మార్చి 9: మండలంలోని దాసరినెమలిపూర్ గ్రామంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి 37వ బ్రహోత్సవాలు ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ గంగిడి వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదిన అధ్యయనోత్సవం, 13న అంకురారోహణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠాపన, 14న పద్మావతి శ్రీనివాసులవారి కల్యాణం, ఉచిత అన్నదాన కార్యక్రమం, 15న సామూహిక వ్రతాలు, 16న బ్రహోత్సవ రథోత్సవం, పూర్ణాహుతి, రాత్రికి ఏకాంతసేవ ఉంటుందని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

'బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

మునుగోడు, మార్చి 9: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృతనిశ్చయంతో పనిచేయాలని ఆ పార్టీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో శనివారం నిర్వహించిన పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ తనదైన శైలిలో చురుకైన పాత్ర పోషించటం ద్వారా లక్ష్యసాధన సాధ్యమని తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ బొడిగె అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు అఖిల్, దర్శనం వేణుకుమార్, నరేందర్‌గౌడ్, ముంగి ధనుంజయ, బండారు యాదయ్య, పులకరం సైదులు, జానయ్యయాదవ్, రాజారాం, సతీష్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

కనగల్, మార్చి 9: మండలకేంద్రమైన కనగల్ గ్రామంలోని శ్రీపార్వతీ బండిరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శివపార్వతుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ప్రధాన అర్చకుడు పి.శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణతంతును నిర్వహించారు. మేళతాలాలు సన్నాయి వాయిద్యాల నడుమ సాగిన కల్యాణతంతును తిలకించేందుకు కనగల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కల్యాణంలో ఒడిబియ్యం కట్నకానుకలను సమర్పించారు. మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ దంపతులు, మాజీ సర్పంచ్ నర్సింగ్ సునీతాకృష్ణయ్యగౌడ్ కల్యాణవేదికపై ఆసీనులై పుస్తె మెట్టెలు, తలంబ్రాలను వేర్వేరుగా అందజేశారు. అక్కినేపల్లి తిరుమలనాద్ పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం భక్తులకు నర్సింగ్ మురళిగౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామి ఎదుర్కోళ్లను వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, మాజీ సర్పంచులు చిట్ల లింగయ్యగౌడ్, పుష్పలత నరహరిగౌడ్, గోగు యాదయ్య, సింగం పెద్దులు గ్రామ పెద్దలు నర్సింగ్ ధనుంజయ గౌడ్, మట్టపల్లి వెంకటేశం, నీలకంఠం శేఖర్, బైరగోని నర్సింహగౌడ్, ఓరుగంటి ఈశ్వరయ్య, వట్టె శంకర్, గణేష్, మండలి గణేష్, దత్తయ్య, బుర్రి సత్తిరెడ్డి, ఉత్సవకమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్కట్‌పల్లిలోని ఎంజేపీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జహాని, నేస్తం వ్యవస్థాపకుడు టీజీ లింగంగౌడ్, మేడి హరికృష్ణ, నాగచారి, బండారు రాజ్యలక్ష్మి, రాంబాబు, షణ్ముఖచారి, దైద నాగరాజు, జక్కలి రాజశేఖర్, నర్మద పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి నర్సింహ అన్నారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ పీఎం మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

మర్రిగూడ: గిరిజన ఆదివాసుల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ సభ్యుడు రమావత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. గిరిజన అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తానని సీఎం రేవంత్ ప్రకటించడం అభినందనీయమన్నారు.

మిర్యాలగూడ టౌన్: వాసవీ, వనిత క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకురాలు రాయపుడి భవాని అన్నారు. కుసుమాంబ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండులో అన్నదానం నిర్వహించారు. క్లబ్ సభ్యులు పండుగలు, శుభదినాల సందర్భంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు.

మిర్యాలగూడ రూరల్: మండలంలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు తిప్పన రాంరెడ్డి, మంద సైదులు, తిప్పన రవీందర్‌రెడ్డి ప్రారంభించారు.

గుర్రంపోడు: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.3లక్షల విరాళాన్ని శనివారం దేవస్థానం కమిటీ సభ్యులకు అందజేశారు. శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు గుర్రంపోడుకు విచ్చేసిన మంత్రి కోమటిరెడ్డిని దేవాలయ కమిటీ చైర్మన్ జాల పెదసత్తయ్య యాదవ్ ఆహ్వానం మేరకు పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరిందని, దేవాలయ కమిటీ సభ్యులు మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి మొత్తం ఖర్చు తానే చెల్లిస్తానని అంగీకరించారు. దీంతో మొదటగా రూ.1లక్ష నగదును అందజేశారు. శనివారం నల్లగొండలోని మంత్రి నివాసంలో మరో రూ.2లక్షల నగదును కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్, ఎంపీటీసీ కుప్ప రాములు, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జాల చినసత్తయ్యయాదవ్, సయ్యద్‌మియా, దేవాలయ వైస్ చైర్మన్ వెలుగు భిక్షం తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు శ్రీ నీలకంఠ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవాలయ చైర్మన్ రాపోలు గిరి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నివాసంలో ఆయనకు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. మండలంలోని శివన్నగూడ గ్రామంలో నీలకంఠ స్వామి బ్రహ్మోత్సవాల జాతర సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మదాయ చైర్మన్ రాపోలు యాదగిరి వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆలయ ధర్మకర్తలు, వైస్ చైర్మన్ చిట్యాల రంగారెడ్డి, మూడిగ నర్సింహ, మోర నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలంగాణ సీపీఎస్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సిరందాసు రాందాసు కోరారు. శనివారం ఎమ్మెల్యే జైవీరారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేతో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భూలక్ష్మి, అనంత, లలిత, రేణుక, నాగమణి, రమాదేవి, బాలు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి ఎద్దు మృతి

శాలిగౌరారం, మార్చి 9: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు పడటంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన శాలిగౌరారం మండలం భైరవునిబండలో శనివారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని భైరవునిబండ గ్రామంలో పులిచర్ల సోమయ్యకు చెందిన ఎద్దు గ్రామశివారులో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.60వేల వరకు ఉంటుందని బాధితుడు పులిచర్ల సోమయ్య తెలిపారు. విద్యుత్ అధికారులు చనిపోయిన ఎద్దుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కొండమల్లేపల్లి, మార్చి 9: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు తిరిగి అందజేశారు. కొండమల్లేపల్లి పోలీసులు తెలిపిన ప్రకారం.. 2023, డిసెంబరు 27వ తేదీన మద్ద రజిత కొండమల్లేపల్లి నుంచి నాంపల్లికి ఆటోలో ఓ ఫంక్షన్‌కు వెళ్తూ మార్గమధ్యలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. ఈ మేరకు ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం తీసుకొచ్చిన సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. శనివారం బాధిత మహిళకు సెల్‌ఫోన్‌ను అందజేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

జిమ్నాస్టిక్స్‌లో పట్టణవాసికి బంగారు పతకం

మిర్యాలగూడటౌన్, మార్చి 9: పట్టణంలోని ఈదులగూడకు చెందిన ఆర్మీ ఉద్యోగి బొడ్డు వినయ్ జిమ్నాస్టిక్స్‌లో బంగారు పతకం సాధించాడు. చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించిన వినయ్ క్రీడా కోటాలో ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం పొందాడు. కేరళ రాష్ట్రంలోని కోజికోడ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారుపతకం సాధించారు. బంగారు పతకం సాధించిన వినయ్‌ను కన్నెబోయిన వెంకన్న, వినయ్, జేఆర్‌రెడ్డి అభినందించారు.